భైంసా పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన జనసందోహంతో కిక్కిరిసిన సభా ప్రాంగణం



# జనం.. గులాబీ వనం

## ముథోల్ ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్

- భైంసా పట్టణానికి తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలు
- జై విఠల్‌రెడ్డి.. జైజై కేసీఆర్ నినాదాల హోరు
- ఆటా..పాటలతో హోరెత్తించిన సభాప్రాంగణం
- సీఎం ప్రసంగంతో శ్రేణుల్లో నూతనోత్తేజం

**భైంసా పట్టణంలో** శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నియోజకవర్గంలోని బాసర, లోకేశ్వరం, ముథోల్, కుభీర్, తానూర్, కుంటాల, భైంసా మండలాల నుంచి ఉదయం 10 గంటల నుంచే శ్రేణులు, ప్రజల రాక మొదలైంది. సీఎం కేసీఆర్ వచ్చే సమయానికి ఆ ప్రాంతం కిక్కిరిసిపోయి గులాబీ వనాన్ని తలపించింది. ఎటు చూసినా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి కటౌట్‌లు, ఫ్లెక్సీలు, కండువాలు కనిపించాయి. మొత్తం 35 వేల కుర్చీలు వేస్తే.. అవి సరిపోక జనం చుట్టుపక్కల ఉన్న చెట్లు, టెంట్ల కింద.. ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో నిలబడాల్సి వచ్చింది. 50 వేల మందికి పైగా వచ్చారు. సభ ప్రాంతంలో ఎండ తగలకుండా భారీ టెంట్లు వేశారు. భోజనంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. సీఎం కేసీఆర్ సభా ప్రాంగణానికి రాగానే.. ఆయనను చూసేందుకు జనం ఎగబడ్డారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్నంత సేపు.. జై కేసీఆర్, జై బీఆర్ఎస్, జైజై విఠల్‌రెడ్డి నినాదాలతో హోరెత్తించారు. గాయని మధుప్రియ ఆధ్వర్యంలో తెలంగాణ కళాకారులు ఆటా.. పాటలతో హోరెత్తించారు. వేదికపై ఉన్న నాయకులతో పాటు ప్రజలు స్టెప్పులేస్తూ ఉత్సాహ పరిచారు. లంబాడాల నృత్యం ఆకట్టుకున్నది. సీఎం కేసీఆర్ ప్రసంగం శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. జన ప్రభంజనాన్ని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి గెలుపు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమైంది.

*- నిర్మల్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)*



**మన జోరు ఎట్లున్నదే :** భైంసా ప్రజా ఆశీర్వాద సభా వేదికపై ముచ్చటిస్తున్నమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పక్కన రాజ్యసభ సభ్యుడు, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు



**అధినేతకు చిరుకానుక :** భైంసాలో ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు చిత్రపటం బహూకరిస్తున్న నాయకురాలు రమాదేవి





**ఆత్మీయ స్వాగతం :** భైంసా ఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు మొక్కను అందిస్తున్న మంత్రి అల్లోల, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



**అధినేత ప్రసంగం.. :** భైంసాలో ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు



సభకు తరలివస్తున్న ప్రజలు



భైంసా ప్రజా ఆశీర్వాద సభా వేదికపై నుంచి అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, ముథోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి